క్లుప్తంగా

108లో ప్రసవం



బయ్యారం: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో నొప్పులు అధికమవటంతో 108 సిబ్బంది వాహనంలోనే కాన్పు నిర్వహించిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన చందనకు నొప్పులు ప్రారంభం కావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వాహనంలో సిబ్బంది నరేష్, ప్రశాంత్ కొత్తగూడెం వెళ్లి గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చందనను తీసుకెళ్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది కాన్పు జరపగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలను గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు చికిత్స నిమిత్తం చేర్పించారు. సిబ్బందికి చందన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వీరభద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని నూతనంగా ఎన్నికైన మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొదటిసారిగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేత



గార్ల: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆదివారం తొలిసారి ఇల్లెందుకు రావడంతో గార్లకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, పీఏసీఎస్ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, హతీరాం, యాకూబ్‌పాషా ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

దంతాలపల్లి: మండలకేంద్రంలో రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలంలో గల ఆకేరు నుంచి దంతాలపల్లి మండలంలోని పలు గ్రామాలకు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ ఓనర్లు, డైవర్లు ఆర్మల రాములు, జాటోత్ శ్రీనులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నాడు.

అవార్డు ప్రదానం



గూడూరు: జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఢిల్లీలో భారతీయ దళిత సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో సామాజిక సేవ చేసిన వారికి జాతీయ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అందులో గూడూరు మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాంకుడోతు గోపినాథ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డును భారతీయ దళిత సాహిత్య అకాడమీ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌పీ సుమనాక్షర్ చేతుల మీదుగా అందుకున్నాడు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు



మహబూబాబాద్ రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కేలోత్ సాయికుమార్, సంఘం డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, నాయకులు వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది

- స్థానికంగా ఉండకపోవడంతో అందని వైద్యం
- జిల్లా వైద్యాధికారి ఆదేశాలు పాటించని వైనం

గార్ల: ఏజెన్సీ ప్రాంతమైన గార్ల మండలంలోని పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్లక్ష్యంతో మగ్గిపోతుంది. ప్రభుత్వం వైద్యసిబ్బంది స్థానికంగా ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందించాలనే దృక్పథంతో వీరికి ఏజెన్సీ అలవెన్స్ సైతం ఇస్తోంది. కాని వీరు స్థానికంగా ఉంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి వద్ద తప్పుడు సూటబులిటీ సర్టిఫికెట్లు పొంది ప్రతీఏటా ఏజెన్సీ అలవెన్స్‌ల పేర లక్షలాది రూపాయలు అప్పనంగా పొందుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మండలంలోని ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

పీహెచ్‌సీ పరిధిలోని 11ఆరోగ్య ఉపకేంద్రాల్లో 22మంది ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు. వీరిలో సుమారు 8మంది ఏఎన్‌ఎంలు స్థానికంగా ఉండడం లేదు. పీహెచ్‌సీలోని ఇద్దరు డాక్టర్లు, సీహెచ్‌ఓ, హెచ్‌ఈఓ, హెల్త్ సూపర్‌వైజర్లు, స్టాఫ్‌నర్స్‌లు స్థానికంగా ఉండకపోవడంతో గ్రామాల్లో వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరంతా స్థానికంగా ఉండకుండా నిత్యం ఖమ్మం, మహబూబాబాద్, తదితర పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. రైళ్ల వేళల ప్రకారం కొందమంది వైద్యసిబ్బంది ఆస్పత్రి మూసే సమయం కంటే ముందే వెళ్లిపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వైద్యసిబ్బంది మారుమూల గిరిజన గ్రామాల్లో సక్రమంగా తిరగకపోవడంతో వైద్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీ వైద్యులు, వైద్యసిబ్బంది స్థానికంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత జిల్లా అధికారులు ఆదేశించినా వైద్యసిబ్బంది మాత్రం అధికారుల ఆదేశాలు పట్టించుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారి స్పందించి స్థానికంగా ఉండని సిబ్బందిపై చర్య తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేవిధంగా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుచున్నారు.

కొత్త ఎమ్మెల్యే కొలువుదీరేనా..!

- నిరుపయోగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం
- మూడేళ్ల క్రితం నిర్మాణం
- ప్రారంభానికి నోచుకోని వైనం

మరిపెడ: మరిపెడలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడేళ్ల క్రితం రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో డోర్నకల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మరిపెడలో సుమారు రూ.కోటితో నిర్మించారు. నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభించేనా.. అందులో ఎమ్మెల్యే కొలువు దీరేనా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. అందులో ప్రభుత్వం సకల సౌకర్యాలతో జీప్లస్ పద్ధతిలో నిర్మించిన భవనంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో నివాసం ఉండేందుకు అవసరమైన గదులు, ప్రజలను కలిసేందుకు పెద్ద హాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండేందుకు భవనం నిర్మించారు. మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆ భవనాన్ని ప్రారంభించలేదు, వినియోగించలేదు. నూతనంగా ఎన్నికైనా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అయినా అందులో కార్యకలాపాలు జరుపుతారా లేదా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇంత వరకు కార్యాలయాన్ని ఉపయోగించకపోవడంతో చుట్టు పక్కల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో కార్యాలయం నిరుపయోగంగా మిగిలింది.



మరిపెడలో నిరుపయోగంగా ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

నేడు ఎమ్మెల్యే రాక..

నూతనంగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ సోమవారం మరిపెడకు రానున్నారు. డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని దంతాలపల్లి మండల కేంద్రం నుంచి నర్సింహులపేట, పెద్దనాగారం, ఎల్లంపేట స్టేజీ ద్వారా ర్యాలీగా మరిపెడకు చేరుకొని మరిపెడలోని వంటికొమ్ము లక్ష్మారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సమావేశం ఏర్పాటు చేయనున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మహబూబాబాద్ రూరల్: మిచాంగ్ తుపాన్‌తో నష్టపోయిన గిరిజన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందులాల్ కోరారు. మానుకోట మండలంలోని మల్యాల, రేగడి తండా, బావుసింగ్ తండాలలో పంటలను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా నందులాల్ నాయక్ మాట్లాడుతూ.. పంటలకు నష్టపరిహారం అందజేయాలని, అలాగే తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంట భీమాను విస్మరించి రైతులకు నష్టం చేకూర్చిందని, నూతన ప్రభుత్వం పంట భీమాను ప్రవేశపెట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బోడ కర్జుడు, ఇస్లావత్ పరమేష్, బానోత్ చంద్రు, బాదావత్ భద్రు, సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి బాదావత్ రాంబాబునాయక్, జిల్లా అధికార ప్రతినిధి సురేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ వినోద్ నాయక్, రైతుసేన జిల్లా అధ్యక్షుడు లింగనాయక్, బానోత్ శ్రీను, ప్రశాంత్, ప్రకాష్ పాల్గొన్నారు.



మిరపతోటను పరిశీలిస్తున్న నాయకులు

ఇద్దరిపై కేసు నమోదు

నెల్లికుదురు: దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఆదివారం విలేకరులతో ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన జెనిగల యాకయ్య నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ శివారులో 3ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఆ భూమిలో వరి పంట సాగు చేసి ఈనెల 3న వరికోత కోసినట్లు తెలిపారు. గడ్డిని కుమారుడు జెనిగల ఉదయ్ కుమార్‌తో కలిసి పొలం పక్కనే ఉన్న కెనాల్ కాల్వ ఒడ్డున పెడుతున్నారన్నారు. అదే గ్రామానికి చెందిన జెనిగల రాజశేఖర్, జెనిగల రాములు ఇద్దరు కలిసి కాల్వ గట్టుపై దారికి అడ్డంగా గడ్డి ఎందుకు పెడుతున్నారని వారిపై కర్రలతో దాడి చేసినట్లు తెలిపాడు. యాకయ్య ఫిర్యాదు మేరకు రాజశేఖర్, రాములు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కేసముద్రం: కేసముద్రంస్టేషన్ జెడ్పీఎస్‌ఎస్‌కి చెందిన 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయసమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్న బాల్యమిత్రులు, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి గురువులు రంగాచారి, కురవి, ఉపేందర్‌రెడ్డి, మల్లయ్య, నజీరుద్దీన్, విజయ్‌కుమార్, రాజమౌళి, ఉమాబాబు, రమేష్‌రెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, అజీజ్‌ఖాన్, సువర్ణ, కల్యాణిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పిన్ని రాము, విజయ్, శ్రీను, హరీశ్, యాకాంతాచారి, రమేష్, ప్రసాద్, బిచ్యానాయక్, యాకన్న, సుధాకర్, వెంకన్న, ఆసియా, రహీమా, మంజుల, సుభాషిని, కవిత, మాధవి, అరుణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

కురవి: మండలంలోని రాజోలు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అల్ల రవి, పీఈటీ దార్ల సునీల్ ఆదివారం తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో నర్సంపేట మండలంలోని మాధన్నపేట జెడ్పీ హైస్కూల్‌లో ఈనెల 8వ తేదీన జరిగిన జిల్లాస్థాయి పోటీలో అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థులు దారావత్ కిశోర్, మూడు వంశీలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు దామోదర్, బీకు చౌహాన్, సురేష్, రవికుమార్, రాజేశ్వరీ, వీరభద్రం, వీరన్న, ఎస్‌ఎంసీ చైర్మన్ సైదులు, సర్పంచ్ ఎస్‌కె మస్తాన్ అభినందించారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

దంతాలపల్లి: నేడు మండలంలో జరిగే డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టునాయక్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా విజయం సాధించి మొదటిసారిగా నియోజకవర్గంలో అడుగు పెడుతున్న రామచంద్రునాయక్ ఉదయం 9గంటలకు మండలం నుంచి ర్యాలీగా బయలుదేరి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారన్నారు.

నేడు రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

దంతాలపల్లి: నేడు సోమవారం మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో కొలువైన శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు రమణశర్మ, పవన్‌శర్మ కోరారు.

అన్నదానం

కురవి: కార్తీక మాసంలో భాగంగా మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ సత్రాల్లో ఆదివారం కురవి మండలం మోద్గులగూడెం గ్రామానికి చెందిన కటకం చంద్రమౌళి, వెంకటమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు కటకం పుల్లయ్య, శంకర్ భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్థికసాయం



గూడూరు: మండల కేంద్రానికి చెందిన సనాతన శివాలయ పూజారి సతీష్‌పాండ్యే కూతురు అనారోగ్యంతో బాధ పడుతుంది. విషయం తెల్సుకున్న పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి ఆదివారం రూ. 15వేలను సతీష్‌పాండ్యేకు అందించాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ కత్తి స్వామి, డాక్టర్ రవీందర్‌రెడ్డి, చాపల నాగేశ్, వెంకన్న పాల్గొన్నారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇబ్బందులు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ మీదుగా నడిచే రైళ్లు తరచూ రద్దవుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరోనా ప్రభావంతో 2020 మార్చి 21నుంచి డోర్నకల్ జంక్షన్ మీదుగా నడిచే రైళ్లన్నీ రద్దు కావడంతో నాలుగు నెలల తరువాత కొన్ని రైళ్లను మాత్రమే పునరుద్ధరించారు. డోర్నకల్ మీదుగా ఖమ్మం, విజయవాడ, తిరుపతి, వరంగల్, హైదరాబాద్, సిర్పూర్‌కాగజ్‌నగర్, కొత్తగూడెం, మణుగూరు తదితర ప్రాంతాలకు ప్రతీరోజూ అనేకమంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తుంటారు. కరోనా సమయం నుంచి అనేక రైళ్లు రద్దవుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగూడెం మార్గంలో ముఖ్యమైన రైళ్లు రద్దు కావడం, మణుగూరు ప్యాసింజర్ తోపాటు విజయవాడ, ఖాజీపేట మధ్య నడిచే పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతో కూలీలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం మూడోలైను నిర్మాణ పనులతో తరచూ రైళ్లను రద్దు చేస్తుండడంతో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వరంగల్, చింతలపల్లి మధ్య మూడో లైను నిర్మాణ పనులతో ప్యాసింజర్ రైళ్లతోపాటు శాతవాహన, ఇంటర్‌సిటీ, కృష్ణా ఎక్స్‌ప్రెస్ లాంటి ముఖ్యమైన రైళ్లతోపాటు కొత్తగూడెం మార్గంలో రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్ట పోతున్నారు. ప్రస్తుతం పగటి వేళల్లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ లాంటి ఒకట్రెండు రైళ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 19వ వరకు రైళ్ల కొనసాగే అవకాశాలు ఉండడంతో ఇబ్బందులు కొనసాగనున్నాయి.



డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు

ఘనంగా సామూహిక వ్రతాలు



మహబూబాబాద్ రూరల్: వ్రత పూజలు చేస్తున్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: కార్తీకమాసం సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని శ్రీమహాగాయత్రీ అమ్మవారి దేవాలయంలో ప్రధాన అర్చకులు వంకోజు జలేంద్రాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు చేసిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు చేశారు.



కేసముద్రం: వత్రం నిర్వహిస్తున్న భక్తులు

కేసముద్రం: మండల కేంద్రంలోని శ్రీరామమందిరంలో సామూహిక శ్రీఅనఘా వ్రతాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తభక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వ్రతాన్ని తెలంగాణ దత్త ప్రచారకర్త, మైసూర్ ఆశ్రమం పీఠానికి చెందిన రాజేంద్రప్రసాద్ వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో దత్తభక్తులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, లింగమూర్తి, ఏకాంతం, విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సందడిగా ఆర్టీసీ ప్రాంగణం

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ ప్రాంగణం ఆదివారం సందడి సందడిగా మారింది. మహిళలకు ఉచిత ప్రయాణం ప్రభుత్వం ప్రకటించగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మహిళలకు ఎక్కువగా బస్టాండ్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఉచిత బస్సు ప్రయాణం ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం ప్రారంభం కాగా అదే రోజు 8,700 మంది, 10వ తేదీన సుమారు 12వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినట్లు అధికారులు తెలుపుతున్నారు. ప్రతి బస్సుల్లో అధికశాతం మహిళలు ప్రయాణిస్తుండగా వంద శాతం అక్యూపెన్సీతో బస్సులు నడుస్తున్నాయని, మహబూబాబాద్ డిపో పరిధిలో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు 64 నడుస్తున్నాయని అధికారులు తెలిపారు.



బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

చిన్నగూడూరు: మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన నక్క సోమయ్యకు సంబంధించిన రూ.34వేల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. అనారోగ్యం రీత్యా నక్క సోమయ్య ప్రైవేట్ ఆస్పత్రిల్లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ వారి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బొమ్మకంటి వెంకట్‌గౌడ్, భాస్కర్, సోమన్న, వెంకన్న, జమాల్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న నాయకులు

తండా నుంచి అసెంబ్లీకి..

పెద్దవంగర: అదో మారుమూల గిరిజన తండా మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని బొమ్మకల్లు గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. దానినే సర్పంచ్ తండా అంటారు. ఈ తండాలో 15 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన జాటోతు రాంచంద్రు నాయక్ ఈ గ్రామానికి చెందిన వాడే. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మాస్టర్ సర్జన్‌గా వైద్య వృత్తి నిర్వహిస్తున్నాడు. జాటోతు మారోని-రాములు నాయక్‌లకు పది మంది సంతానం కాగా తొమ్మిదో సంతానం రాంచంద్రు నాయక్. వ్యవసాయ చేస్తూ కష్టపడి తల్లిదండ్రులు చదివించారు. ఎంబీబీఎస్, ఎంఎస్, ఉస్మానియాలో పూర్తి చేశాడు. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 2002 నుంచి శివసాయి ఆస్పత్రి స్థాపించి వైద్యసేవలు అందిస్తూ 2006లో టీడీపీ అనుబంధ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించాడు. 2014లో టీడీపీ నుంచి డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఓటమి పాలయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ తన సమీప ప్రత్యర్థి డీఎస్ రెడ్యానాయక్‌పై 53,131 ఓట్ల మెజార్టీతో విజయం సాధించాడు. దీంతో బొమ్మకల్లు గ్రామ పరిధితో పాటు సర్పంచ్ తండా, రెడ్డికుంట, కాంద్యా, బౌసలి తండాల్లో సంబురాలు నిర్వహించుకున్నారు.



రాంచంద్రు నాయక్

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

పెద్దవంగర: జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానికులకు మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా సభ్యులు మాట్లాడారు. దేశంలో ప్రజలు అనుభవించే మానవ హక్కులపై నాగరికత ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగం హక్కులతో పాటు విధులు పొందుపరించందన్నారు. వీటిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా సభ్యులు మేరుగు సందీప్, బైన కిరణ్, భాస్కరాచారి, స్థానికులు సమ్మయ్య, నాగరాజు, శోభన్, సురేష్, అనిల్ పాల్గొన్నారు.

బెల్ట్ గ్రేడింగ్ ఆత్మరక్షణకు దోహదం

జనగామ: విద్యార్థులు బెల్ట్ గ్రేడింగ్ నేర్చుకుంటే వారి ఆత్మరక్షణకు దోహదపడుతుందని కల్నల్ భిక్షపతి, గంటా రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నారాయణ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఆర్మీలో, ఇతర రంగాల్లో చేరి దేశ భవిష్యత్‌ను కాపాడాలని చెప్పారు. గ్రేడింగ్ నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డీజీఎం రిజ్వాన, ఆర్‌ఐ వేణుకుమార్ ప్రిన్సిపాల్ రిగ్సం బిస్వా, ఏఓ బీఎన్‌చారి పాల్గొన్నారు.

ముమ్మరంగా వరికోతలు

గార్ల: గార్ల మండలంలో మిషన్‌ల ద్వారా వరికోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఇటీవల తుపాన్‌తో వరిపంట భూములు తడిసి పోవడంతో చైన్ మిషన్ ద్వారా మాత్రమే వరికోతలు కొనసాగుతున్నాయి. మిషన్ గంటకు రూ.3,500 చెల్లిస్తు రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వర్షాలు పడకపోతే టైర్ మిషన్ ద్వారా వరికోతలు కొనసాగేవని, టైర్ మిషన్ గంటకు కేవలం రూ.2వేలు మాత్రమే చెల్లించేవాళ్లమని, దీంతో పెట్టుబడి ఆదా అయ్యేదని రైతులు పేర్కొంటున్నారు.



చైన్‌మిషన్ ద్వారా వరికోతలు